తీగలగుట్టపల్లిలోని విజేత గ్రీన్‌హోమ్స్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

ఆశీర్వదించండి.. నిధులు తీసుకువస్తా

- ఐదేళ్లలో బండి సంజయ్ ఐదు కొత్తలు కూడా తేలే
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్
- విజేత గ్రీన్‌హోమ్స్ కాలనీవాసులతో సమావేశం

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 19 : తనను ఎంపీగా ఆశీర్వదించి గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానని, కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా పోరాడి అభివృద్ధి కోసం నిధులు తీసుకువస్తానని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్ ప్రజలు బండి సంజయ్‌ను ఎంపీగా గెలిపిస్తే ఐదేళ్ల కాలంలో అధికారంలో ఉండి కూడా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఐదు కొత్తలు కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. మతం పేరుతో ఓట్లు అడగడం తప్ప అభివృద్ధి కోసం ఎప్పుడూ మాట్లాడడం లేదని దుయ్యబట్టారు. శుక్రవారం తీగలగుట్టపల్లిలోని విజేత గ్రీన్ హోమ్స్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను గతంలో ఎంపీగా ఉన్నప్పుడే రైల్వేలైన్‌పై ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయించేందుకే తీగలగుట్టపల్లిని నగరంలో విలీనం చేశామని, స్మార్ట్‌సిటీ తీసుకువచ్చి రూ.వెయ్యి కోట్ల నిధులు తీసుకురాగలిగానన్నారు. కానీ, బండి సంజయ్ మాత్రం ఒక్క గుడి తేలేదని, బడి తేలేదన్నారు. తాను త్రిబుల్ ఐటీ కోసం ఎంతో కృషి చేశానని, కానీ బండి సంజయ్ మాత్రం ఆ విషయాన్ని పూర్తిగా మరిచిపోయారని విమర్శించారు. నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే పార్లమెంట్‌లో కరీంనగర్, రాష్ట్ర సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా నిలుస్తారని తెలిపారు. ఎన్నికలు వస్తేనే బండి సంజయ్‌కి ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్న బండికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తన రాజకీయ పబ్బం కోసం ఆడ్డగోలుగా మాట్లాడడం తప్ప ప్రజల గురించి ఆలోచించడం లేదని మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేకపోయారని దుయ్యబట్టారు. ఎంపీగా వినోద్‌కుమార్ స్మార్ట్‌సిటీ తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంట కళ్యాణి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ,పాల్గొన్నారు.

హుస్నాబాద్ కోర్టు ఆవరణలో..

చిగురుమామిడి, ఏప్రిల్ 19: హుస్నాబాద్ కోర్టు ఆవరణలో శుక్రవారం కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్‌తో న్యాయవాదులు, కక్షిదారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తే ఐదేళ్లలో కరీంనగర్‌ను అభివృద్ధి చేసి చూపుతానన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి వినోద్ కుమార్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, నాయకులు మదన్ మోహన్ రెడ్డి, అన్వర్ పాషా, వెంకట్రామిరెడ్డి, రవీందర్ గౌడ్, బార్ ప్రెసిడెంట్ మురళీమోహన్, ఏజీపీ కన్నోజు రామకృష్ణ, న్యాయవాదులు బెజ్జంకి రాంబాబు, బాకం సంపత్, కక్కెర్ల శివ శంకర్ గౌడ్, చిత్తారి హన్మయ్య, ఒగ్గోజు సదానందం తదితరులున్నారు.

ఓటింగ్ శాతం పెంపే లక్ష్యం

- 75శాతానికి పైగా పోలింగ్ కోసం కృషి
- సీ విజిల్ యాప్ ద్వారా 68 ఫిర్యాదులు
- సువిధ యాప్ నుంచి 168 దరఖాస్తులు
- 84,620 ఎపిక్ కార్డుల పంపిణీ
- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి వెల్లడి

పెట్టెల్లో భద్రపరుస్తున్న ఈవీఎంలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, ఏప్రిల్ 19 : పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా జిల్లా ఎన్నికల యంత్రాంగం కృషి చేస్తున్నదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఎన్నికల నిర్వహణ, నామినేషన్ల ప్రక్రియపై శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంటు పరిధిలో మొత్తం ఓటర్లు 17,91,970 మంది ఓటర్లు ఉండగా, వీరిలో అత్యధికం మహిళలేనని చెప్పారు. సెగ్మెంట్‌లో 2,194 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన వసతులు కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో 64.49 శాతం ఓట్లు పోలింగ్ కాగా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 74.5శాతానికి పైగా పోలైనట్లు వివరించారు. ఈసారి 80శాతం వరకు పోలింగ్ జరిగేలా వినూత్న కార్యక్రమాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగుల కోసం ఒక్కో పోలింగ్ కేంద్రం, యువత కోసం ఒకటి, ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల కోసం ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అత్యవసర విధులు నిర్వహించే వారు, పోలింగ్ విధుల్లో ఉండే ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామన్నారు. హోం ఓటింగ్‌కు అర్హులైన వారు 54,730 మంది ఉండగా, దరఖాస్తు చేసుకునేందుకు 12డీ ఫారాలు పంపిణీ చేస్తున్నామన్నారు. మే3 నుంచి హోం ఓటింగ్ నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఎస్సెన్షియల్ ఓటర్లు 15 వేల మంది వరకు ఉండగా, వీరికి కూడా 12 డీ ఫారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ల కోసం 12 వేల వరకు దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో అవకతవకలపై ఈసీఐ అందుబాటులోకి తెచ్చిన సీవిజిల్ యాప్ ద్వారా ఎవరైనా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఇప్పటివరకు 68 ఫిర్యాదులు రాగా ఎప్పటికప్పుడు వాటిని పరిశీలిస్తూ, చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ప్రచారం కోసం నిర్వహించే ర్యాలీలు, సభలు, సమావేశాలకు అవసరమైన అనుమతులు సువిధ యాప్ ద్వారా మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 168 అర్జీలు రాగా, 105 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామన్నారు. గత నవంబర్ నెల నుంచి ఇప్పటివరకు 84,620 ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఈవీఎంలను కలిసిన వ్యయ పరిశీలకుడు

కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిశీలకుడు అశ్విన్‌కుమార్‌పాండే శుక్రవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతిని కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించిన అనంతరం డీఈవో మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు పరిశీలకులు జిల్లాలోనే ఉండి, ఎన్నికల వ్యయానికి సంబంధించిన అన్ని అంశాలు పరిశీలిస్తారని చెప్పారు. ఎలాంటి ఫిర్యాదులున్నా వ్యయ పరిశీలకుడు అశ్విన్‌కుమార్ పాండే మొబైల్ నంబర్ 9032659531కు ఫోన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కాగా, కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్, కంట్రోల్ రూమ్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకుడు అశ్విన్ కుమార్ పాండే పరిశీలించారు. మీడియా సెంటర్ పనితీరుతో పాటు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కొండయ్య, ఏపీఆర్‌వో వీరాంజనేయులు, కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి ఎస్.నాగార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాను సరి చూసుకోవాలి

ఓటరు జాబితాను ర్యాండమ్‌గా రాజకీయ పార్టీల నేతలు చెక్ చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పోలింగ్ బూత్‌ల పేర్లు, స్థల మార్పిడి, అదనంగా ఏర్పాటు చేసే పోలింగ్ బూత్‌ల అంశంపై అన్ని రాజకీయ పార్టీల నేతలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కులంకషంగా చర్చించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ బీ శ్రీనివాస్, ఆయా రాజకీయ పార్టీల నేతలు సత్తినేని శ్రీనివాస్, మడుపు మోహన్, కళ్యాడపు ఆగయ్య, వెంకటరమణ, నాంపల్లి శ్రీనివాస్, బర్కత్ అలీ, మిల్కూరి వాసుదేవ రెడ్డి, పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు

ఆరుగురు ఆర్టీసీ ఉద్యోగుల సరెండర్

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్19: హుజూరాబాద్ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించే ఆరుగురు ఉద్యోగులను ఆకస్మికంగా ఆర్ఎం కార్యాలయానికి సరెండర్ చేస్తూ సంస్థ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల హుజూరాబాద్ డిపో మేనేజర్ సామల శ్రీకాంత్ డిపోలోని ఉద్యోగి వద్ద రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో బీఎంతో అత్యంత సన్నిహితంగా ఉండి ఆయన అవినీతి అక్రమాలకు ఆరుగురు ఉద్యోగులు అన్ని విధాలా సహకరించినట్లు భావించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు వారిని సరెండర్ చేసినట్లు సమాచారం. కాగా, సరెండర్ చేసిన వారిలో ఏడీసీలు పీ వెంకటయ్య, టీ రాజమణి, డిపో కార్యాలయం హెడ్ క్లర్క్ సురేందర్, మెకానిక్ ఎండీ జాఫర్, డిపో అభివృద్ధి కమిటీ సభ్యుడు సీహెచ్ రవీందర్, శంకరపట్నం బస్టాండ్‌లో ఓడీ చేసే కండక్టర్ టీ స్వామి ఉన్నారు. ఆర్ఎం కారాలయంలో రిపోర్ట్ చేసిన వారికి తిరిగి ఎక్కడ కూడా పోస్టింగ్ ఇవ్వకపోవడం గమనార్హం. కాగా, హుస్నాబాద్ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ వెంకటేశ్వర్లును హుజూరాబాద్ డిపో ఇన్‌చార్జి మేనేజర్‌గా ఉన్నతాధికారులు నియమించగా, గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించినట్లు కార్యాలయ ఉద్యోగులు శుక్రవారం తెలిపారు.

అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మహేందర్

మహేందర్‌కు నియామక పత్రం అందజేస్తున్న జాతీయ, రాష్ట్ర నాయకులు

తెలంగాణచౌక్/ గన్నేరువరం, ఏప్రిల్ 19: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా గన్నేరువరం మండలం ఖాసింపేట గ్రామానికి చెందిన న్యాయవాది జేరిపోతుల మహేందర్ నియామకయ్యారు. ఈ మేరకు నగరంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకురి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాల్వల రామచంద్రం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్ సమక్షంలో మహేందర్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తానన్నారు. తన మీద నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన జాతీయ ఉపాధ్యక్షుడు బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మధుతో పాటు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్19: పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, ప్రజాసంఘాల నాయకుడు అందే వెంకటేశ్వర్‌రావును ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వినయ్‌కుమార్, ఎం మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీ మధు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పారమిత విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 19: పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్(ఐటీఓ)లో అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ రితేష్ మెహతా పేర్కొన్నారు. ఇందులో భాగంగా గణితంలో రాష్ట్రస్థాయిలో వెల్ది హర్షిణి, అర్హాన్ లతీఫ్, సామాన్యశాస్త్ర విభాగంలో ఎన్.రుషిక స్ఫూర్తి, జి.సహస్ర, ఎస్.సిరి, యశ్మిత్ పటేల్, రిధి పబ్బతి అత్యుత్తమ ప్రతిభ చూపి బహుమతులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు.

26 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 19 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో హోటల్ మేనేజ్‌మెంట్ రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలను పరీక్ష కేంద్రంగా కేటాయించినట్లు తెలిపారు.

కేజీబీవీని సందర్శించిన రాష్ట్ర అధికారి

తిమ్మాపూర్, ఏప్రిల్19: మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య భట్టు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి బోధన మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంచి పర్యావరణాన్ని కాపాడుతున్నందుకు పాఠశాల ప్రత్యేకాధికారి పడాల కిరణ్ జ్యోతిని అభినందించారు.

కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు కరువు

నీతారాంపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, నాయకులు

చిగురుమామిడి, ఏప్రిల్ 19: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, మండల పరిషత్ వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి విమర్శించారు. మండలంలోని సీతారాంపూర్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం వారు పరిశీలించారు. రైతులను కేంద్రాల వద్ద సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈజీఎస్ కూలీల వద్దకు వెళ్లి కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. మోసపూరితమైన వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు మహంకాళి కొమురయ్య, శ్యామకూర సంపత్ రెడ్డి, గోగురి కృష్ణారెడ్డి, ముస్కుల కృష్ణారెడ్డి, బుద్ధి సంతోష్ తదితరులున్నారు.

హామీలు అమలు చేయకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

శంకరపట్నం, ఏప్రిల్ 19: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి హెచ్చరించారు. శుక్రవారం సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మరోసారి బీజేపీని గద్దెనెక్కిస్తే రాజ్యాంగాన్నే మార్చే ప్రమాదం ఉందన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌లు కుంగిన సమయంలో ఉన్న నీటిని శ్రీపాద ప్రాజెక్టులోకి ఎత్తిపోయకుండా వృథాగా గోదావరిలోకి వదలడంతోనే నేడు రాష్ట్రంలో తాగునీటికి ఇక్కట్లతో పాటు కరెంటు కష్టాలు ఏర్పడ్డాయని విమర్శించారు. సమావేశంలో సీపీఐ నాయకులు సదానందం, రవి, బహదుల్లా, నాగులు, మొగిలి పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై హర్షం

చిగురుమామిడి, ఏప్రిల్ 19: ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రాల మల్లేశం, ముదిరాజ్ మహాసభ యువత అధ్యక్షుడిగా పండుగ బాలు ముదిరాజును నియమించడంపై జడ్పీ ఫ్లోర్ లీడర్, జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి గీకురు రవీందర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

'కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదు'

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్19: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిందని, హామీలు నెరవేర్చని ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ ఓటు అడిగే హక్కు లేదని బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ అనతి కాలంలోనే ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. అలాగే కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నయా పైసా పనైనా చేశాడా? అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

వాహన తనిఖీల్లో రూ.15.81 లక్షల నగదు పట్టివేత

రాంనగర్, ఏప్రిల్ 19: పార్లమెంటు ఎన్నికల కోడ్ వెలువడినందున అక్రమ డబ్బు తరలింపును అరికట్టేందుకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా బ్యాంకుల వద్ద నిఘా వేసిన పోలీసులు, పెద్ద ఎత్తున డబ్బు తీసుకెళ్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని తనిఖీలు కొనసాగాయి. ఈ తనిఖీల్లో కరీంనగర్‌లోని మూడు స్టేషన్ల పరిధిలో సరైన ఆధారాలులేని రూ.15,81,900 స్వాధీన పరుచుకున్నామని పోలీసులు ప్రకటించారు. వీటిలో రాజీవ్‌చౌక్ వద్ద వన్ టౌన్ పోలీసులు దుర్గమ్మ గడ్డకు చెందిన సుమన్ కల్యాణ్ అనే వ్యక్తి నుంచి రూ.7 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. టూ టౌన్ పోలీసులు గీతా భవన్ చౌరస్తాలో మానకొండూర్‌కు చెందిన నెల్లి భాస్కర్ నుంచి రూ.1,11,900, ఐబీ చౌరస్తా వద్ద, కోతిరాంపూర్‌కు చెందిన కొల ప్రదీప్ కుమార్ నుంచి రూ.5.70 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో కట్టారాంపూర్‌కు చెందిన గాండ్ల సురేశ్ వద్ద రూ. 2 లక్షలు పట్టుకున్నారు. పట్టుబడిన మొత్తం నగదును తదుపరి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివసాయి

కుడితల శివసాయి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 19: ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన కుడితల శివసాయి నియామకమయ్యారు. ఈ మేరకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నియామక పత్రం అందించారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 19 : నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి కార్యాలయంలోని సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సంద గణేశ్ మాట్లాడుతూ, జిల్లా విద్యాధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. పదో తరగతి ఫలితాలు రాకముందుకే గత సంవత్సర ఫలితాలతో ప్రచారం చేపట్టి ప్రవేశాలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే ఆందోళనకు వెనుకాడబోమన్నారు. ఇక్కడ సాయి, తిరుపతి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

విద్యానగర్, ఏప్రిల్ 19: ప్రభుత్వ దవాఖానల్లోని శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, మరో వారం గడిస్తే వేతనాలు రాక మూడు నెలలు అవుతుందన్నారు. ఈ క్రమంలో వారు ఇంటి అద్దెలు చెల్లించలేకపోతున్నారని, కిరాణా సరుకులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలకు సంబంధించిన బడ్జెట్ విడుదలైనా ప్రభుత్వ దవాఖాన అధికారులు, కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో హాస్పిటల్ కార్మికులు యూనియన్ అధ్యక్షుడు అరుణ్, కార్యదర్శి కళావతి, ఉపాధ్యక్షురాలు శారద, కార్మికులు రాజు, అంజలి, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చామనపల్లిలో ఉచిత వైద్యశిబిరం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 19: చామనపల్లిలో శుక్రవారం కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని పద్మశాలీ సంఘం అధ్యక్షుడు జీ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యశాల జనరల్ ఫిజిషియన్ డాక్టర్ రావికంటి నాగరాజు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 200మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. మెడికవర్ హెడ్ గుర్రం కిరణ్, పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం మల్లేశం, పుప్పు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నాగులమ్మ స్థిర ప్రతిష్ఠాపనకు హాజరైన ఎమ్మెల్యే

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని పర్లపల్లిలో నాగులమ్మ స్థిర ప్రతిష్ఠ మహోత్సవానికి శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు కసర్ల సంపత్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టుముక్కుల సంపత్ రెడ్డి, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు బుర్ర అజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో ట్రాఫిక్ తిప్పలు

మధురానగర్ చౌరస్తాలో రోడ్డుపైనే నిలిపిన బస్సులు

గంగాధర, ఏప్రిల్ 19 : మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. మధురానగర్ చౌరస్తాలో బస్సు స్టాండు ఉన్నా ఆర్టీసీ బస్సులను రోడ్డుపైనే నిలిపి ప్రయాణికులను దింపివేయడం, ఎక్కించుకోవడం చేస్తుండడంతో చౌరస్తాకు నాలుగు వైపులా వాహనాలు నిలిచిపోయి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్సులను రోడ్లపై కాకుండా బస్సుస్టాండులో నిలపాలని ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య క్రమశిక్షణ అవసరం

- నగర మేయర్ వై.సునీల్ రావు
- మెడికవర్ ఆధ్వర్యంలో వరల్డ్ లివర్ డే

విద్యానగర్